క్లుప్తంగా

తునివాడలో 'పరివర్తన'



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు, ఎస్ఈబీ సిబ్బంది

రేగిడి: మండలంలోని తునివాడ గ్రామంలో పరివర్తన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగడం వల్ల కలిగే అనర్థాలను రాజాం ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ వివరించారు. యువత చెడు అలవాట్లకు బానిసకాకుండా ఉన్నత చదువులు చదువుకుని, మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ-క్రాప్ జాబితాలో పేర్లు చూసుకోండి



కోటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ-క్రాప్ జాబితా ప్రదర్శిస్తున్న సర్పంచ్ శ్రీను

బాడంగి: గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించిన ఈ-క్రాప్ నమోదు జాబితాలో రైతులు తమ పేర్లు ఉన్నవీ లేనివీ చూసుకోవాలని ఏవో కె.శిరీష తెలిపారు. ఇదే విషయమై మండలంలోని పలు గ్రామాల్లో ఆమె ఆదివారం పర్యటించి, రైతులతో మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న తర్వాత కూడా పేర్లు లేకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. సున్నా వడ్డీ రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వం పంట కొనుగోలు చేస్తుందన్నారు.

అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: పట్టణంలోని గాంధీనగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం ప్రారంభించారు. ఇక్కడ జరిగిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలతో అన్నదాన కార్యక్రమం చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. నాలుగు వేలకు పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు భగవతి

వంగర: మండల కేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి కోరారు. ఇదే విషయమై గ్రామ మహిళలతో కలిసి సచివాలయ మహిళా పోలీసు చింతలూరి లక్ష్మికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే ఉద్యమిస్తామని, పోలీసులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

భగవద్గీత పఠనంతో మోక్షం



భగవద్గీత గొప్పతనం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత పఠనం చేయడం ద్వారా మోక్షం పొందవచ్చని పాలకొండకు ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతలోని శ్లోకాలు చదివి, అర్థం చేసుకుంటే మంచి పౌరులుగా తయారు కావడమే కాకుండా మంచి భావాలు కలిగిన వ్యక్తులుగా గుర్తింపు పొందుతారన్నారు. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సన్మానం

రాజాం సిటీ: మండలంలోని పొగిరి పీహెచ్‌సీలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఆకిరి భార్గవ్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను విశ్రాంత వైద్యాధికారి విద్యాసాగర్ ప్రశంసించారు. సత్కరించిన వారిలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యులు నరేంద్ర, సిద్ధేశ్వరి, ప్రశాంతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు

గ్రామ గ్రామాన నందెన్న ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌరీపౌర్ణమి పురస్కరించుకుని, పల్లెల్లో ఈ ఉత్సవ శోభ నెలకొంది. నందెన్న, గౌరీదేవి సమేత పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, మండపంలో ప్రతిష్ఠించి, పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఏటా నాగులచవితి వరకు ఈ సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ కాగా అనంతరం అనుపోత్సవం నిర్వహిస్తారు. -సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: నందెన్నను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు



బొబ్బిలి: పక్కి గ్రామంలో నందెన్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు




రాజాం: కొత్తపేటలో నందెన్న ఉత్సవాల్లో పూజలు చేస్తున్న గ్రామస్తులు



తెర్లాం: ఉద్దవోలులో పూజలందుకుంటున్న నందెన్న, గౌరీదేవి, శివపార్వతులు



రాజాం సిటీ: పెనుబాకలో నందెన్నకు పూజలు చేస్తున్న జెడ్పీటీసీ బండి నర్సింహులు



బాడంగి: దొంకినవలసలో నందెన్నపై కొలువైన పార్వతీపరమేశ్వరులు

సీఎం జగన్‌తోనే బీసీల అభ్యున్నతి

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని, జగనన్న సీఎం అయిన తర్వాతే బీసీలంతా ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతుకుతున్నారని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడిన వారు గతంలో టీడీపీ హయాంలో వెనుకబాటుకు గురైన బీసీలను ఈ నాలుగున్నరేళ్లలో అధిక శాతం మంది బీసీలకు పార్టీ పదవులు కట్టబెట్టి, ముందువరుసలో నిలబెట్టింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. బీసీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తుండడంతోనే బీసీలంతా వైఎస్సార్ సీపీ వెంట నడుస్తున్నారన్నారు. దీంతో బొబ్బిలి నియోజకవర్గంలోని టీడీపీ నేతల్లో వణుకు పుడుతోందన్నారు. ఇక్కడ బీసీలను పోటీలో నిలిపేందుకు టీడీపీ భయపడుతోందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత నివ్వడంలో సీఎం జగన్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరిలో ఏలూరులో నిర్వహించిన బీసీ గర్జనలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి

వైద్య శిబిరానికి విశేష స్పందన

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలస గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన దాదాపు 100 మందికి పైగా రోగులకు మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి వైద్యులు సుభద్ర, శ్వేత, రమ్య ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక హారతి



సామూహిక హారతులు సమర్పిస్తున్న మహిళలు

బొబ్బిలి: మండలంలోని పెంట నగరేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. చంద్రగ్రహణ దోష నివారణ సందర్భంగా సామూహిక హారతులు స్వామికి సమర్పించినట్లు పురోహితుడు ధూపం వాసు తెలిపారు.

వర్షాలు కురవాలని పూజలు..

సంతకవిటి: మండలంలోని కొండగూడేం గ్రామంలో ఆదివారం వరుణ దేవుడికి పూజలు చేశారు. గ్రామస్తులు, రైతులు కొండపైకి వెళ్లి, వరదపాయసం చేసి, పారబోశారు. వర్షాలు కురవాలని భగవంతుడిని వేడుకున్నారు.

పుస్తక పఠనంతో అపారమైన జ్ఞానం

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, దీని ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పలు పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి బాగా చదువుకుని, జ్ఞానవంతులు కావాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం, చిత్రలేఖనంపై కూడా విద్యార్థులు దృష్టిసారించాలని కోరారు.



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

చురుగ్గా అభివృద్ధి పనులు

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామ పంచాయతీలోని సీఎస్ఆర్ పురంలో అభివృద్ధి పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధిలో రోడ్డు నిర్మాణంతో పాటు మురుగు కాలువలు నిర్మిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.4 లక్షలతో ఈ పనులు జరుగుతున్నాయని ఎంపీపీ లావేటి సులోచన తెలిపారు.



రాజాం: సీఎస్ఆర్ పురంలో నిర్మాణ దశలో రోడ్డు

జీవామృతం తయారీపై అవగాహన



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామంలో జీవామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ కిరణ్ తొలుత గ్రామానికి చెందిన కోట్ల నారాయణరావు పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండిస్తున్న మిరప పంటను పరిశీలించి, ఆరోగ్యవంతంగా ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆవుపేడ, ఆవుమూత్రం తదితరాలతో జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. జీవామృతం పంటలపై పిచికారీ చేయడం ద్వారా పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారించవచ్చన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాల సీజ్

బొబ్బిలి: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు వాహనాలను ఆదివారం పట్టుకుని, సీజ్ చేసినట్లు తహసీల్దారు డోల రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని డొంగురువలస గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వుతున్నట్లు సమాచారం అందిందని, ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది దాడులు నిర్వహించి, గ్రావెల్‌తో ఉన్న రెండు ట్రాక్టర్లు, ఓ టిప్పరును తహసీల్దారు కార్యాలయానికి తరలించారన్నారు.



సీజ్ చేసిన వాహనాలు

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

రాజాం: స్థానిక పట్టణంలోని పలు టీ, టిఫిన్ షాపులు, భోజన హోటళ్లలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని సూచించారు. వంటలకు తాజా సరుకులనే వాడాలన్నారు. నాసిరకం పదార్థాలు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రాజాంలోని ఓ భోజన హోటల్‌లో తనిఖీలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారు మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ ఇచ్చి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని కోమటిపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కుముందానపేట, కోమటిపల్లి గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, వాటి కోసమే ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనదేనన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం ఆయన ద్వారా సాధ్యమవుతోందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల సూచనల మేరకు ఆ పార్టీ వారికే వచ్చేవన్నారు. దీంతో అర్హులు నష్టపోయేవారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. నాడు టీడీపీ వ్యవసాయాన్ని శుద్ధ దండగ అంటే నేడు వైఎస్సార్ సీపీ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో పంపిణీ చేస్తూ అవసరమైనప్పుడు సాగు సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చిందన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు జగనన్న పాలనలో ఆనందంగా ఉన్నామని చెబుతుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే పార్టీని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వంగపండు శ్రీరాములు నాయుడు, ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కవి, పండితులు గుత్తి నర్సింహ మాస్టారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. భగవాన్ శ్రీసత్యసాయి బాబా నామాన్ని స్మరించుకుంటే జీవితం సన్మార్గంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక ప్రసంగమిస్తున్న నర్సింహ మాస్టారు

స్నేహంకోసం..

- అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి ఆర్థికసాయం
- చందాలు వేసుకుని మరీ, రూ.లక్ష సేకరించి, అందజేత



శ్రీనుకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

రాజాం సిటీ: వారి స్నేహం అజరామరం.. తమ స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న వారంతా కలత చెందారు. ఆర్థిక పరిస్థితి బాగాలేక వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న సంగతి గమనించి, ఆదుకోవాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా రూ.లక్ష సమకూర్చి, అందించారు. వివరాల్లోకి వెళితే.. పట్టణ పరిధిలోని చాకలి వీధికి చెందిన విష్ణుపాత్రుని శ్రీను గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని అతడితో చదువుకున్న 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తెలుసుకున్నారు. ఎలాగైనా తమ స్నేహితుడి ఆరోగ్యం మెరుగుపర్చేందుకు సహాయం చేయడంతో పాటు బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. వాట్సాప్ గ్రూపు ద్వారా స్నేహితులందరికీ ఈ విషయం తెలిసేలా చేసి రూ.లక్ష వరకు సమకూర్చారు. ఈ మొత్తాన్ని శ్రీనుకు ఆదివారం అందజేయగా, శ్రీను ఎంతో సంతోషించాడు. అతడికి సహాయపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో తమ వంతు సహాయం చేస్తామని అతడి స్నేహితులు ఉండ్రాళ్ల రాము, డాక్టర్ గిరిధర్, గోపాల్‌దాస్, సురేష్, బాలాజీ, మల్లేష్, గురునాథం, అన్నారావు తెలిపారు.

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. 2/2023

Between:
1. బంకురు రమణమ్మ, W/o లేటు తిరుపతి, వ॥ 63 సం॥లు, డోర్ నెం.40–183/1, నాయుడు కాలనీ, బొబ్బిలి మున్సిపాలిటీ, విజయనగరం జిల్లా.
2. బంకురు అనురాధ, W/o ఏగిరెడ్డి స్వామినాయుడు, D/o లేటు బంకురు తిరుపతి, వ॥ 43 సం॥లు, టీచర్, ఉద్దవోలు గ్రామం, తెర్లాం మండలం, విజయనగరం జిల్లా.
3. బంకురు బాలమురళీధర్‌రావు, S/o లేటు తిరుపతి, వ॥ 40 సం॥లు, నాయుడు కాలనీ, బొబ్బిలి, విజయనగరం జిల్లా.
4. బంకురు వెంకటధనంజయనాయుడు, S/o లేటు తిరుపతి, వ॥ 38 సం॥లు, Rest -do-

---- పిటీషనర్లు

And:
Nil

---- రెస్పాండెంటు

పై నెంబరు పిటీషన్‌లో ఇందలి 1వ పిటీషనర్ గారికి భర్త గారు, మరియు 2 నుండి 4 పిటీషనర్లకు తండ్రి గారు అయిన బంకురు తిరుపతి గారు తే 08-04-2021 దీ నాడు కాలం చేసినందున, అతనికి సంబంధించిన SBI Mutual Funds లో Folio No: 15667899 కలిగిన SBI Long Term Equity fund Regular Plan- Growth and SBI Focused Equity Fund Regular-Growth లకు సంబంధించిన నగదుకు ఇందలి పిటీషనర్లు వారసులు అయినందున, సదరు పిటీషనర్లు పై కోర్టులో Succession certificate ఇప్పించమని కోరుచూ ఇందలి పిటీషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో ఇందలి పిటీషనర్లు తప్ప మరిఎవ్వరూ వారసులు లేరని తెలియజేయుచూ యుండుట వలన ఇతరులు ఎవ్వరికయినా ఈ పిటీషన్‌పై ఎట్టి అభ్యంతరములు యున్నయెడల తే 20.11.2023 దీన ఉ॥10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా హాజరై ఎట్టి ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనియెడల పరోక్షంన తీర్మానం చేయుదురు.
(ఈ ప్రకటన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రచురించడమైనది.)

సం/- కొల్లి సింహాచలం, గుర్రాల క్రిష్ణ
అడ్వకేట్లు, బొబ్బిలి
సెల్: 9949783951

బొబ్బిలి
తే 29.10.2023 ది